# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 43 | మంగళవారం 14, అక్టోబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



## ఆర్టీసీ మహాలక్ష్మికి బాకీ
# 1350 కోట్లు!

**నెలకు రూ.10 కోట్లు ఎగ్గొడుతున్న రేవంత్ సర్కారు**
**రూ.700 కోట్లకుపైగానే బస్‌పాస్‌ల పెండింగ్‌లు**
**రూ.300 కోట్లు ఇస్తేనే ఆర్టీసీ వేతనాలు చెల్లించే పరిస్థితి**
**రూ.500 కోట్లు చెల్లించాలని బీఆర్ఎస్ డిమాండ్**
**ఆర్టీసీకి నిధుల మంజూరులో కాంగ్రెస్ సర్కారు అలసత్వం**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

ఆర్టీసీకి 'మహాలక్ష్మి పథకం.. ఉచిత బస్సు ప్రయాణం' నిధులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వంతో భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయి. వేల కోట్ల రూపాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నా.. ప్రజా రవాణాను నిర్లక్ష్యం చేస్తుండటంతో సంస్థ ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేని పరిస్థితికి చేరుకుంది. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి ఒక్క మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన బకాయిలే సుమారు రూ.1350 కోట్లు ఉన్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన నాటి నుంచి ప్రతినెలా ఎంతోకొంత (కనీసం రూ.10కోట్లు) డబ్బులు పెండింగ్ పెడుతుండటంతో ఇవ్వాల్సిన డబ్బులు భారీగా పేరుకుపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కింద నెలకు సుమారు రూ.310 కోట్లరూ.350 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల ఆర్టీసీ సమస్యలపై గళమెత్తిన బీఆర్ఎస్ నేతలు ప్రజారవాణా సంస్థను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ఇవ్వాల్సిన బకాయిలతోపాటు, ప్రభుత్వం తరపున ..మిగతా 2లో



# సంక్షేమ హాస్టళ్లకు రూ.60 కోట్లు..


**భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులకు కేటాయింపు**
**విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్**
**వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం.. విద్యార్థులకు వైద్య పరీక్షలు**
**ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...**
**సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**
**వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు**




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీసీ, ఎస్సీ , ఎస్టీ , మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్రప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది.

హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యాసంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు ..మిగతా 2లో



## వెనుకబడిన వర్గాల కోసం టీజీఐఎల్పీ

**సెర్ప్ సహకారంతో స్వయం ఆదాయం పొందేలా చర్యలు**
**ఇప్పటివరకు 3,554 కుటుంబాల గుర్తింపు**
**టీజీఐఎల్పీ అమలుపై మంత్రి సీతక్కతో భేటీ అయిన బ్రాక్ ప్రతినిధుల బృందం**

02



## తగ్గిన సీజనల్ వ్యాధులు

**గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు**
**సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

# చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం

**ఖైదీలకు బీమా, కుటుంబ సభ్యులకు వడ్డీలేని రుణ సదుపాయం కల్పించడం అభినందనీయం**
**జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ భేష్**
**కస్టడీ-కేర్-కరక్షన్ కు ఆచరణ రూపమిస్తున్న జైళ్ల శాఖ**
**ఖైదీల ఉత్పత్తులతో ప్రత్యేక మేళా నిర్వహించండి : బండి సంజయ్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ సభ్యులకు వడ్డీలేకుండా ..మిగతా 2లో

## మంత్రుల మధ్య వివాదాలు
# చాలా చిన్న అంశం

**మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశమన్న టీపీసీసీ చీఫ్**
**ఇది తమ కుటుంబ సమస్య, పరిష్కరించుకుంటామని వ్యాఖ్య**
**సమాచార లోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తాయన్న మహేశ్ కుమార్**




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్రంలో మంత్రుల మధ్య తలెత్తిన వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఇది చాలా చిన్న అంశమని, తమ కుటుంబ సమస్య అని, దీనిని తామే పరిష్కరించుకుంటామని ..మిగతా 2లో

# కారు, బుల్డోజర్ మధ్య మొదలైన యుద్ధం..

**రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోంది..!**
**కాంగ్రెస్ గురించి తెలిసే గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు ఆ పార్టీని గెలిపించలేదన్న కేటీఆర్**
**గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్య**
**అజారుద్దీన్‌కు ఇచ్చిన ఎమ్మెల్సీ కోర్టులో నిలబడదన్న కేటీఆర్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ ..మిగతా 2లో

## సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి
# రూ.251 కోట్లు

**ఈసారి కోటిమందికి పైగా భక్తులు వస్తారని అంచనా**
**నాపై మంత్రులు ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు**
**ఆ వార్తలను నమ్మడం లేదు**
**నేనేంటో అందరికీ తెలుసు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

అశేష భక్తుల కొంగుబంగారం సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం 251 కోట్ల రూపాయిలు ఖర్చు చేయనున్నట్లు వరంగల్ ఇన్ ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి, ..మిగతా 2లో

# తగ్గిన సీజనల్ వ్యాధులు

- **గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు**
- **సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖాన్ల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేండ్లతో పోల్చితే, ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు గణనీయంగా తగ్గాయని హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర నాయక్ మంత్రికి వివరించారు.గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ చికున్‌గున్యా కేసులు 361 నమోదవగా, ఈ ఏడాది జనవర్ నుంచి సెప్టెంబర్ వరకూ 249 కేసులు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. ఇదే సమయంలో గతేడాది 226 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది 209 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. గతేడాది టైఫాయిడ్ కేసులు 10,149 నమోదవగా, ఈ ఏడాది 4600 మాత్రమే నమోదయ్యాయని అధికారులు వివరించారు. గతేడాదితో పోలిస్తే డెంగీ కేసులు 2900 తక్కువగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

ఈ మేరకు అధికారులు మంత్రికి నివేదిక అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండడం భినందనీయమన్నారు.

మొత్తంగా చూసినప్పుడు కేసులు తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్ హైదరాబాద్, మరో నాలుగైదు జిల్లాల్లో స్వల్పంగా కేసులు పెరిగాయని, ఆయా జిల్లాల్లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు.ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, ఆయా జిల్లాల్లోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆ మార్పుల వల్ల ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాలు పడుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు.ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టే, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలను ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు.

ఒకవేళ సీజనల్ వ్యాధుల బారినపడితే, ప్రభుత్వ దవాఖాన్ల వైద్య సేవలను ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ప్రభుత్వ దవాఖాన్లలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



## సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి రూ.251 కోట్లు




**మొదటిపేజీ తరువాయి**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అధికారులతో కలిసి ఆలయ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా 101 కోట్ల రూపాయిలు మంజూరు చేయగా వీటిలో 71 కోట్ల రూపాయిలకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. గతంలో మంజూరైన 150 కోట్ల రూపాయిలతో కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేడారం జాతరకు వచ్చే నిధులు జంపన్న వాగులో వరదలాగ జారిపోకుండా గిరిజన, గిరిజనేతరుల ఆరాధ్యదైవాల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, దీనిలో భాగంగా రోడ్లు ఇతర నిర్మాణాలు సాగిస్తామని చెప్పారు. మరో 50 రోజుల్లో ఈ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఒక క్రమపద్ధతిలో సాగేలా కలెక్టర్, ఎస్పీలకు సూచనలు ఇచ్చామన్నారు. ఆలయాభివృద్ధికి ఎవరు ఎటువంటి సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని, ఈ పనులను మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తారని అన్నారు. గతంలో ఈ జాతరకు కోటి మందికి పైగా వచ్చినట్లు అధికారులు చెప్పారని ఈ సారి ప్రభుత్వ అభివృద్ధి చర్యల కారణంగా ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు స్పందిస్తూ "నేనేంటో అందరికీ తెలుసు, 70 కోట్ల కాంట్రాక్ట్ వర్క్‌కు తాపత్రయపడే అవసరం నాకు లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మడం లేదు. ఫిర్యాదు చేయడానికి ఏమంది అధిష్టానానికి ఎవరూ ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు. నేను కూడా అలా జరుగుతుందని నమ్మడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నాం. సమ్మక్క సారలమ్మల వంటి సీతక్క, సురేఖ అక్కలతో ఈ కార్యక్రమాలకు హాజరవుతాను"అని మంత్రి పొంగులేటి చెప్పారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల మధ్య వివాదాలు చాలా చిన్న అంశం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన అన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన పరామర్శించారు. ఇటీవల ఖర్గేకు పేస్‌మేకర్ అమర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఖర్గేను కలిశారు.



అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సమాచార లోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడం సహా ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను ఖర్గేకు వివరించినట్లు మీడియాకు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని స్పష్టం చేశారు.

# సంక్షేమ హాస్టళ్లకు రూ.60 కోట్లు..

**మొదటిపేజీ తరువాయి**

తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు.

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్మాణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి , బి. షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన వర్గాల కోసం టీజీఐఎల్పీ

- **సెర్ప్ సహకారంతో స్వయం ఆదాయం పొందేలా చర్యలు**
- **ఇప్పటివరకు 3,554 కుటుంబాల గుర్తింపు**
- **టీజీఏఎల్పీ అమలుపై మంత్రి సీతక్కతో భేటీ అయిన బ్రాక్ ప్రతినిధుల బృందం**

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

రాష్ట్రంలోని అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఉద్దేశించిన తెలంగాణ ఇన్క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్పీ) అమలుపై చర్చించేందుకు సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో బ్రాక్ (బీఆర్ఏసీ) ప్రతినిధుల బృందం భేటీ అయింది. సెర్ప్ సహకారంతో ఆదివాసీలు, జోగినీలు, ఇతర పేద కుటుంబాల ఆర్థిక సాధికారత కోసం బ్రాక్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఎంపిక చేసిన పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహకాలు, లోన్లు, రాయితీలు అందించి, వాటిని స్వయం ఆదాయం పొందే స్థాయికి చేర్చడమే తెలంగాణ సమ్మిళిత జీవనోపాది కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది

**3,554 కుటుంబాల గుర్తింపు, శిక్షణ**

టీజీఐఎల్పీ అమలు తీరుపై బ్రాక్ ప్రతినిధులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఇప్పటివరకు మొత్తం 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన మండల మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి లబ్ధిదారులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా పేద కుటుంబాలకు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చే మార్గాలు కల్పించి, వారిని ఆర్థికంగా స్వావలంబన కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు బ్రాక్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. మంత్రి సీతక్కతో భేటీ అయిన వారిలో గ్రెగరీ చెన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్వేతా బెనర్జీ (ఇండియా లీడ్), ఉషా రాణి (ప్రోగ్రాం లీడ్), వి. రమేష్ (సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్), అభిషేక్ (ప్రోగ్రాం అసోసియేట్) తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ కూడా పాల్గొన్నారు.



## ఆర్టీసీ మహాలక్ష్మికి బాకీ 1350 కోట్లు!

**మొదటిపేజీ తరువాయి**

ఆర్టీసీ ఇస్తున్న రాయితీలు మొత్తం కలిపి నెలకు కనీసం రూ.500 కోట్లు ఇవ్వాలని కోరారు.

**80శాతం ఉచిత ప్రయాణాలే!**

ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలో ఒక్కో బస్సులో సుమారు 80శాతం వరకు ఉచిత ప్రయాణాల టిక్కెట్లే ఉంటున్నాయని కండక్టర్లు చెప్తున్నారు. 20శాతం మాత్రమే ప్రయాణిస్తున్న పురుషుల టికెట్ల ద్వారా డబ్బులు వస్తున్నాయని అంటున్నారు. దీంతో ఆర్టీసీకి రోజూ ప్రత్యక్షంగా వచ్చే నగదు భారీగా తగ్గిపోయిందని వాపోతున్నారు. జీరో టికెట్లకు లెక్కకట్టి ప్రతినెలా నిధులు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ దాటవేస్తున్నది. దీంతో ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు ప్రతినెలా 20వ తేదీ నుంచే సచివాలయంలోని ఉన్నతాధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్తున్నారు. 10రోజులు ముందు నుంచి చెప్తేగానీ ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని వివరిస్తున్నారు. ఇవ్వాల్సిన డబ్బుల్లోనూ ప్రభుత్వం కోత విధిస్తుండటంతో ఆ లోటును పూడ్చలేక సతమతవుతున్నామని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు. మహిళా ప్రయాణికులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రీయింబర్స్ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నాయి. జీరో టిక్కెట్ ఎర్నింగ్స్‌ను కూడా చార్జ్ టికెట్ ఎర్నింగ్స్ కింద పరిగణించాలని సూచిస్తున్నారు. చార్జీతో కూడిన టికెట్ ఎర్నింగ్స్ పెంచాలని కండక్టర్లపై, కేఎంపీఎల్ పెంచాలని డ్రైవర్లపై వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇతర రాయితీల బాకీ రూ.700 కోట్లు**

వివిధ వర్గాలకు ఇస్తున్న బస్‌పాస్ రాయితీల డబ్బులు ప్రభుత్వం వందల కోట్లలో ఆర్టీసీకి





చెల్లించాల్సి ఉంది. 25 లక్షల మంది విద్యార్థులు, జర్నలిస్టులు, దివ్యాంగులు, ఇతరులు కలిపి మొత్తం 31 లక్షల మందికి ఇస్తున్న బస్‌పాస్ రాయితీలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. కాగా ఈ బాకీ మొత్తం సుమారు రూ.700 కోట్లు వరకు ఉంటుందని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. వాటిని ప్రభుత్వం నుంచి రాబట్టే విషయంలో యాజమాన్యం కూడా మెతక ధోరణి అవలంబిస్తున్నదని ఆర్టీసీ యూనియన్ల నేతలు అంటున్నారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు పెంచడం లేదని, కొత్త బస్సుల కొనుగోలులో తాత్సారం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఆర్టీసీ విస్తరణ కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం.. సంస్థ ఆస్తులను, డిపోలను, వర్క్‌షాపులను, కార్గో వ్యవస్థను వరుసగా ప్రైవేట్ పరం చేస్తుండం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేట్ అక్రమ వాహనాలను కట్టడి చేయాలని, ఆర్టీఏ అధికారులు రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆర్టీసీ యూనియన్ల నేతలు కోరుతున్నారు.

## కారు, బుల్డోజర్ మధ్య మొదలైన యుద్ధం

**మొదటిపేజీ తరువాయి**

పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు



గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

## చర్లపల్లి జైలు దేశానికి ఆదర్శం.

**మొదటిపేజీ తరువాయి**


రుణ సదుపాయం కల్పించడం అభినందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదవిస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా ఉండలేమన్నారు. కస్టడీకేర్‌కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్నఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూల వనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు.

అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. 25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ. 11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతోపాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖైదీలకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజే విజన్ అద్భుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో 'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, అక్టోబర్ 13(ప్రజా స్వరం):**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 56 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్,ట్రైనీ కలెక్టర్ హార్స్ చౌదరి, డి ఆర్ ఓ మంగ్లీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడున జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి





- **జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్**

**వికారాబాద్, అక్టోబర్ 13(ప్రజా స్వరం):**

2025 26 ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో,ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. సోమవారము అదనపు కలెక్టర్ చాంబర్ లో 20252026, ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ కోసం సంబంధిత అధికారులతో వరి కొనుగోలు సన్నాహక సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు నిర్వహణ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులందరూ టార్పాలిన్ కవర్లు ఎక్కువగా ఉంచుకోవాలన్నారు. ఐకెపి, సమ భావన సంఘాల సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, తదితర సంస్థల ద్వారా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ, అందుకోసం జిల్లా స్థాయి దాన్యం కొనుగోళ్ల కేంద్రాల కమిటీ ద్వారా ప్రభుత్వం సూచించిన ప్రకారం ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు, ధాన్యం సేకరణ వివరాలను వ్యవసాయ శాఖ ద్వార స్వీకరించి కేంద్రాలకు వచ్చే దాన్యం పూర్తి వివరాలు డాటా ఎంట్రీ లో పొందుపరచాలన్నారు. కొనుగోలు రవాణా, డ్రై మిషన్,ప్యాడి క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, 17% మాయిశ్చరైజ్ ఉండాలని , ఆటోమేటిక్ జాలి మిషన్లు, ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా కు రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలనీ,అవీ రావులపల్లి, కోతుల పూర్ లలో చెక్ పోస్టులు ఉన్నాయని, ఈ చెక్ పోస్టులలో నిరంతర తనిఖీ ఉండాలని, వేరే రాష్ట్రానికి సంబంధించిన ధాన్యం రాష్ట్రానికి రాకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, అవసరానికి అనుగుణంగా ముందస్తుగా సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సెంటర్లో కనీస వసతులైన మంచినీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ప్యాడి సెంటర్లను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ప్రతిరోజు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రణాళిక ప్రకారం లారీలను, హమాలీలను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లకు సంబంధించి దాన్యం డబ్బుల ను రైతుల ఖాతాలలో వెంటనే జమ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రాలలో నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,అడిషనల్ ఎస్ పి రాము నాయక్, సివిల్ సప్లయ్ సుదర్శన్ ,డిసిఓ నాగార్జున , పౌర సరఫరాల సంస్థ మేనేజర్ మోహన్ కృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# దౌల్తాబాద్‌లో ఆగ్రో రైతు సేవా కేంద్రం–2 ప్రారంభం




- **రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో**

**దౌల్తాబాద్, అక్టోబర్ 13 (ప్రజాస్వరం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో సోమవారం "ఆగ్రో రైతు సేవా కేంద్రం-2"ను మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడిన సాయికిరణ్ రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, కీటకనాశనాలు ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే పొందేలా ఈ ఆగ్రో రైతు సేవ కేంద్రం ఏర్పాటు చేయబడింది. రైతులకు సబ్సిడీపై విత్తనాలను ఈ కేంద్రం ద్వారా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. రైతులు సమయానికి వీటిని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొప్రైటర్ మజీద్ హుస్సేన్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్, స్టీవెన్ రెడ్డి, ఖలీల్, నాగరాజు, శేఖర్ రమేష్ యాదవ రెడ్డి హరిబాబు, కరుణాకర్ మణికంఠ రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి





- **ప్రజలు సమర్పించిన ఆర్జీలపై సత్వరమే స్పందించాలి జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి**

**శామీర్ పేట,అక్టోబర్ 13(ప్రజాస్వరం)**

ప్రజల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఆర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన ఆర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని, అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తులకుగాను అర్జీదారులకులకు తగు కారణాలు తెలపాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 81 ఆర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక దాడి, హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు, 15 వేల జరిమానా

**మెదక్ అక్టోబర్ 13 (ప్రజా స్వరం)**

మహిళపైన లైంగిక దాడి, హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, 15 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ 2020 నవంబర్ 10 న పకీర్ నాయక్ మెదక్ పట్టణంలోని నంబర్ వన్ కల్లు దుకాణం వద్ద ఒక మహిళతో పరిచయం ఏర్పరుచుకున్నాడని అన్నారు. ఆమెతో మాటలు కలిపి చేగుంట రోడ్ వైపు ఉన్న ధర్మకంట సమీపంలోని పొలానికి తీసుకెళ్లి, ఆమె పై కామావాంఛ తీర్చుకుని డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగిందన్నారు. మాటామాటా పెరగడంతో పకీరానాయక్ కోపానికి గురై అక్కడ పక్కన ఉన్న సీసా పగలగొట్టి మహిళ గొంతు కోసి హత్య చేయడం జరిగిందని అన్నారు. ఈ ఘటన పై అప్పటి ఎస్ఐ పోచయ్య కేసు నమోదు చేసి, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సీఐ ఏ. వెంకటయ్య సమగ్ర దర్యాప్తు నిర్వహించి, అన్ని సాక్ష్యాలను సేకరించారని, ప్రస్తుత



సీఐ మహేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారాని అన్నారు. కోర్ట్ లైజానింగ్ ఆఫీసర్ ఎస్ఐ విట్టల్, సీడీఓలు కృష్ణ, రామయ్య విచారణ ప్రక్రియలో సహకరించారని, పూర్తి సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నీలిమ నిందితుడు పకీరా నాయక్ కు జీవిత ఖైదు 15 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసులో సమర్థంగా దర్యాప్తు చేసి, న్యాయం సాధించేందుకు కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# మహిళ హత్య దర్యాప్తు వేగవంతం

**మెదక్ అక్టోబర్ 13 (ప్రజా స్వరం)**

కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏడుపాయల వద్ద మొదటి వంతెన సమీపంలోని వెంచర్ లో జరిగిన మహిళా హత్య సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఈ ఘటన పై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, హత్య చేసిన నిందితులను గుర్తించి పట్టుకునేందుకు వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంలో ఆయన వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, కుల్చారం మోహినొద్దీన్ సిబ్బంది ఉన్నారు.





# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**దౌల్తాబాద్, అక్టోబర్ 13 (ప్రజాస్వరం):** మండల పరిధిలో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఐకెపి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. సూరంపల్లి, లింగరాజుపల్లి, నర్సంపల్లి, ముబారస్పూర్, హైమత్‌నగర్ గ్రామాల్లో ఈ కేంద్రాలను మండల ఐకెపి అధికారి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ — "అన్నదాతలు ఆరు నెలలు శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులు ధాన్యాన్ని తగినంత తేమతో ఆరబెట్టి, పరిశుభ్రంగా ప్యాక్ చేసి కేంద్రాలకు తీసుకురావాలి. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే తక్కువకు ఎవరూ కొనుగోలు చేయరాదు. అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే ఐకెపి లేదా వ్యవసాయ శాఖ అధికారులను సమాచారం ఇవ్వాలి," అని సూచించారు.ప్రస్తుతం ప్రభుత్వం కేటాయించిన గ్రేడ్-1 రకం వరి మద్దతు ధర (MSP) రూ. 2,300 ప్రతిక్వింటాల్, గ్రేడ్-2 రకానికి రూ. 2,280 ప్రతిక్వింటాల్‌గా ఉన్నదని తెలిపారు. కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం తూకాలు, తడి కొలిచే పరికరాలు, రికార్డు పుస్తకాలు, టోకెన్ వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.రైతులు పంటను విక్రయించిన తర్వాత నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే చెల్లింపులు జమ చేయబడతాయని పేర్కొన్నారు. ఎవరూ మధ్యవర్తుల మోసపూరిత చర్యలకు లోనుకాకుండా ప్రభుత్వ విధానాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది జేర్ర కిష్టయ్య,జంగం రాజేశ్వరరావు బోయిని బాలరాజ్ తోపాటు వ్యవసాయ అధికారి సంతోష్‌కుమార్ రైతు నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.











# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజావాణి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ అక్టోబర్ 13 (ప్రజా స్వరం)**

ప్రజల అర్జీలు, వినతులు, సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కల్పించే కార్యక్రమమే" ప్రజావాణి "అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలు తమ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలకు తక్షణ స్పందన, వేగవంతమైన పరిష్కారం అందించడం ఈ వేదిక యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. అధికారులు ప్రజావాణి ద్వారా అందిన ప్రతి అర్జీ పై సమగ్ర పరిశీలన చేసి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అభ్యర్థనలను గౌరవిస్తూ, పారదర్శకతతో, సమయపాలన తో సేవలందించాలని తెలిపారు. ప్రజావాణి వేదిక ద్వారా ఇప్పటివరకు చాలా సమస్యలు పరిష్కారమయ్యాయనీ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమన్వయాన్ని బలపరచడంలో ఈ కార్యక్రమం ముఖ్యపాత్ర పోషిస్తోందని తెలిపారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 58 ప్రజావాణిలో వినతులు సేకరించినట్లు అందులో భూ సమస్యల కోసం 24, పెన్షన్ కోసం 10, ఇందిరమ్మ ఇండ్లు కోసం 6, ఇతర 18 మొత్తం 58 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, ట్రైనీ ఆర్ డి ఓ మెహమ్మద్.అహ్మద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఇసుక కొరత లేకుండా చూడాలి

**మెదక్ అక్టోబర్ 13 (ప్రజా స్వరం)**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎండీసీ ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్ ను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు కేవలం నల్గొండ నుంచి వస్తున్న ఇసుక కు ఒక్క మెట్రిక్ టన్నుకు రవాణా చార్జి కింద 1200 చెల్లించి గ్రామ కార్యదర్శి ద్వారా టోకెన్ తీసుకొని వస్తే ఇసుక ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇసుక మాఫియాను తొలగించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మెదక్ జిల్లాకు 9 వేల పైచిలుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని ప్రస్తుతం వివిధ దశలలో ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, టిఎస్ఎండిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.









# రైతు దళాలను నమ్మి మోసపోవద్దు

**దౌల్తాబాద్ అక్టోబర్ 13 ప్రజాస్వరం**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వాన కాలంలో పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సీసీలు రోజా, అంజమ్మ అన్నారు .సోమవారం రాయపోల్ మండలం రామారం, గొల్లపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడం కోసం గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు దళారులను నమ్మి తక్కువ ధరకు దాన్యం విక్రయించి మోసపోవద్దని, ఐకేపీ, పిఎసిఎస్ ఆధ్వర్యంలో గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులు అందరు ఆయా కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. మండల పరిధిలో మొత్తం 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వానకాలంలో పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని అన్నదాతలు అధైర్యపడవద్దన్నారు. రైతులు పంటను కోసిన వెంటనే తమ పొలాల వద్దనే ఆరాపెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. అధికారులు ధాన్యం తూకం వేసేటప్పుడు ఒక బస్తాకు 41 కిలోలు మాత్రమే కొనుగోలు చేయాలి అధికంగా తూకం వేసినట్లు తమ దృష్టికి వస్తే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి 2389/ బి గ్రేడ్ వరి ధాన్యానికి 2369/ రూపాయల మద్దతు ధరను కేటాయించి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అధైర్యపడవద్దు పండించిన పూర్తిగా ధాన్యాన్ని కొనుగోలు చేసేవరకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాలయ్య, విజయ్ కుమార్, మాజీ సర్పంచులు మహేష్,హనుమంతు, వీవోఏ లు, మహిళ సమైక్య అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**దౌల్తాబాద్, అక్టోబర్ 13 (ప్రజాస్వరం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉమ్మడి నరసింహారెడ్డి మాతృమూర్తి ఉమ్మడి పెంటమ్మ అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా నాయకులు నరసింహారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి బాధలో పాలుపంచుకున్నారు. పెంటమ్మ మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులు ఈ దుఃఖాన్ని భరించే ధైర్యం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం ప్రతినిధులు, యువజన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నాయకులు పెంటమ్మ కుటుంబానికి పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. పెంటమ్మ ప్రాంత ప్రజల పట్ల మమకారం చూపిన, సామాజిక సేవలో ముందుండే వ్యక్తిగా గుర్తించబడ్డారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు.

## బీసీ రిజర్వేషన్ ప్రభుత్వానికి అగ్ని పరీక్షల మారింది

- **దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి.**

**దౌల్తాబాద్ అక్టోబర్ 13 ప్రజాస్వరం**



తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ మరో అగ్ని పరీక్షలాగా మారుతుందని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించే ప్రయత్నం చేస్తే హైకోర్టు స్టే ఇచ్చింది. ఇది కేవలం చట్టపరమైన సమస్య కాదు, సామాజిక న్యాయానికి మరో అడ్డంకి అని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలు మేధావులు బీసీల పక్కన నిలబడి సామాజిక న్యాయాన్ని రక్షించాలి. ఈ పోరాటం కుల పరమైనది కాదు. ఇది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్య పోరాటం. బహుజన ఐక్యత అంటే వర్గాల కలయిక కాదు.చైతన్యాల ఏకత్వం బహుజన ఐక్యత అంటే ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీలకు వేర్వేరు సమస్యలు ఉన్నా, వారి లక్ష్యం ఒకటే సమానత్వం, స్వాభిమానం మరియు న్యాయం.బ్రాహ్మణ, బనియా, ఠాకూర్లు ఐక్యమైతే, బహుజనులు ఎందుకు విడిపోయి ఉండాలి. రాజకీయాల్లో బీసీ శక్తి పెరగడం అంటే,ఎస్సీ, ఎస్టీ శక్తి తగ్గడం కాదు.అది బహుజన ప్రజాస్వామ్య బలం పెరగడం. మేధావుల బాధ్యతయుతంగా బహుజన సమాజాన్ని చైతన్యం చేస్తూ ఏకం చెయ్యాలి.ఇలాంటి సమయాల్లో మేధావుల మౌనం ప్రమాదకరం. న్యాయం కోసం పోరాటం జరుగుతున్నప్పుడు తటస్థంగా ఉండటం నేరం. మండల్ యుగంలో మేధావులు మాట్లాడారు.ఇప్పుడు మళ్ళీ మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్ల పోరాటం కేవలం ఒక వర్గ హక్కు కాదు. ఇది బహుజన సమాజం యొక్క రాజ్యాంగ హక్కు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలు, మేధావులు బీసీల పక్కన నిలబడి మళ్ళీ ఒక కొత్త మండల్ యుగం ప్రారంభించాలన్నారు. ఈ పోరాటం యొక్క గమ్యం ఒకటే సామాజిక న్యాయం,ప్రజాస్వామ్యం, సమానత్వం. బీసీ రిజర్వేషన్ల పోరాటానికి ఎస్సీ, ఎస్టీ ప్రజలు మేధావులు మద్దతుగా నిలబడాల ఆయన సూచించారు.

## నేడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలపై విస్తృత సమావేశం

**దౌల్తాబాద్, అక్టోబర్ 13 (ప్రజాస్వరం):**



తొగుట, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల పరిధిలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు విస్తృత స్థాయి సాగథన్ శ్రీజన్ అభినయ్ సమావేశం తొగుట మండలంలోని చెరుకు బాలమ్మ బాల కిస్టా రెడ్డి కళ్యాణ మండపం, రాంపూర్ లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సిద్దిపేట జిల్లా ఏఐసిసి అబ్జర్వర్, ఉత్తరాఖండ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోతి రౌటేల హాజరుకానున్నారు. అలాగే ముఖ్య అతిథిగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు మాట్లాడుతూ, ఈ సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలపరచడమే లక్ష్యమని తెలిపారు. మండలాల వారీగా పార్టీ కార్యకర్తలు, ఆత్మ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తదితరులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బీసీ బిల్లుపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ కపట ప్రేమ

- **బిల్లు అమలు చేసే వరకు కాంగ్రెస్ బిజెపి పార్టీలకు సమదూరం పాటిస్తాం**
- **బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సుప్రీం కోర్టుకు వెళ్లడం శుభపరిణామం**
- **స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం బీసీల్లో మనోధైర్యం పెంచుతుంది**
- **జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్**

**గజ్వేల్ అక్టోబర్ 13. (ప్రజా స్వరం) :**



బీసీ రిజర్వేషన్ బిల్లు పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కపట ప్రేమ చూపిస్తుండగా, బీసీ బిడ్డ బండి సంజయ్ స్పందించకపోవడం దురదృష్టకరమని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ విమర్శించారు. సోమవారం వర్గల్ మండలం గౌరారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తూనే గవర్నర్ రాష్ట్రపతి వద్ద పెండింగ్లో ఉన్న ఈ బిల్లుల ఆమోదానికి ఒత్తిడి పెంచకపోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం శుభ పరిణామని, బీసీ బిల్లును అడ్డుకుంటున్న ఆయా పార్టీలు చౌకబారు విమర్శలుమాని బిల్లుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బీసీ బిల్లు అమలుపై అన్ని వర్గాలను ఐక్యం చేస్తూ జాగృతి రాజీలేని పోరాటం చేస్తుండగా, అడ్డుకుంటున్న రాజకీయ శక్తులకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.
ముఖ్యంగా హైకోర్టు నిర్ణయం బీసీలను బాధించినప్పటికీ సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. 60 శాతం జనాభా ఉన్న రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ సాధన లక్ష్యంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని, 42 శాతం రిజర్వేషన్ అంశంపై అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించి అందుకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య , ఉద్యోగ నియామకాల్లో ఇబ్బంది లేని అంశాన్ని దృష్టిలో పెట్టుకొని 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీల చర్యలను బలహీన వర్గాలు, బిసి సంఘాలు గమనిస్తుండగా, రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు చేతులెత్తేయడం తగదని నిలదీశారు.

## గ్రామాన్ని పరిశుభ్రతకు కృషి చేయాలి

- **తాండూరు డీఎల్పీఓ ప్రవీణ్ కుమార్**

**పెద్దేముల్, అక్టోబరు 14(ప్రజాస్వరం):**

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తాండూరు డివిజనల్ పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కందనెల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీఓ రతన్ సింగ్, పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



## ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు?

**హైదరాబాద్, ప్రజాస్వరం**

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ది చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు.ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటు పరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు. అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించగలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్ధం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధి, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా.. కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

## బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్ర

**హైదరాబాద్,అక్టోబర్13(ప్రజాస్వరం):**



విద్యుత్ పంపిణీ సంస్థల ప్రమేయం లేకుండా కేంద్రం చట్టం చేయబోతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు చెప్పారు. బొగ్గు గనులను కార్పోరేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు కార్పోరేట్ సంస్థలకు, విద్యుత్ ఉత్పత్తి సంస్థల లాభాల కోసం కేంద్రం ఇలా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై బీవీ రాఘవులు విమర్శలు గుప్పించారు. విద్యుత్ చట్ట సవరణ ప్రతిపానను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న చేసిందని తెలిపారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని పేర్కొన్నారు. గతం కంటే దుర్మార్గమైన అంశాలు ఇందులో ఉన్నాయని ఆరోపించారు. వినియోగదారుల, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం ద్వారా అదానీ కంపెనీలకు అధిక లాభం కలగనుందని బీవీ రాఘవులు ఆరోపించారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీని ద్వారా రైతాంగానికి, ఉచిత గృహ విద్యుత్ పొందుతున్న వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం.. అదానీ కంపెనీలకు మేలు చేసేందుకు చేసిందే అని విమర్శించారు. జూలై 25న సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారని గుర్తుచేశారు. మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేస్తామని అన్నారని చెప్పారు.



# లిటిల్ హార్ట్స్ డైరెక్టర్‌తో నితిన్ క్రేజీ ప్లాన్ వర్కవుట్ అయ్యేనా?





చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యువ హీరోల్లో ఒకడు నితిన్. 2020లో వచ్చిన భీష్మ తర్వాత నితిన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినా బాక్సాఫీస్ వద్ద నిరాశప రిచాయి. ఈ మధ్య కాలంలో నితిన్ నటించిన రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు ఊహించని విధంగా బోల్తా కొట్టాయి. నితిన్ స్క్రిప్టుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నా ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడంలో వెనకబడుతున్నాయి.నితిన్ ఇప్పటికే ఇష్క్ ఫేం విక్రమ్ కే కుమార్‌తో స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. స్వారీ అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రానికిసంబంధించి కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. అయితే నితిన్ ఇప్పుడు లిటిల్ హార్ట్స్ డైరెక్టర్ సాయిమా ర్తాండ్‌తో సినిమాకు ప్లాన్ చేస్తున్నాడన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్ లో హల్ చల్ చేస్తోంది.

సాయిమార్తాండ్ రీసెంట్‌గా నితిన్‌ను కలిసి కామెడీ డ్రామా నేపథ్యంలో సాగే ఓ కథను చెప్పాడట. స్క్రిప్ట్‌లోని కథ, కథనం బాగా నచ్చడంతో ఇంప్రెస్ అయిన నితిన్ పాజిటివ్‌గా స్పందించినట్టు ఇన్‌సైడ్ టాక్. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే రాబోయే రోజుల్లో నితిన్‌సాయి మార్తాండ్ కాంబోలో సినిమా వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు అర్థమవుతుంది.ఇక ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన లిటిల్ హార్ట్స్ బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.40 కోట్లు వసూళ్లు చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఇలాంటి జోనర్‌లోనే నితిన్‌తో సినిమా రాబోతుందన్న వార్త ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సిద్ధుతో కిస్ సీన్లకు నో చెప్పిన ఇద్దరు హీరోయిన్లు?



సిద్ధు జొన్నలగడ్డ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. డిజె టిల్లు సినిమాతో పాపులర్ అయిన సిద్ధు జొన్నలగడ్డ మంచి బ్రాండ్ ఉన్న హీరోగా మారిపోయారు. అలాంటి సిద్ధు జొన్నలగడ్డ ఇప్పుడు ప్రేక్షకులను అలరించేందుకు తెలుసు కదా అనే సినిమాతో వస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశి కన్నా, శ్రీ నిధి శెట్టి ఇద్దరూ హీరోయిన్లుగా నటించనున్నారు. మనోడి సినిమా అంటే కచ్చితంగా రొమాంటిక్ సీన్స్ ఉంటాయని అందరూ అంచనా వేసుకుంటారు.అయితే అలాంటి వాళ్లకు చెక్ పెడుతూ సంచలన ప్రకటన చేశాడు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఈ సినిమాలో ఒక్క కిస్ సీన్ కూడా పెట్టలేదట. అంటే సాధారణ రొమాంటిక్ సీన్లతో సరిపెట్టేసారు అన్నమాట. ఈ సినిమాలో కిస్ సీన్లు లేవని స్వయంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో క్లారిటీ ఇచ్చారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. కథ విన్నప్పుడే కిస్ సీన్లు లేకుండా చేయాలని ముందే అనుకున్నట్లు స్పష్టం చేశారు. డిజె టిల్లు పాత్రకు ఈ సినిమాలో క్యారెక్టర్ కు చాలా తేడాలు ఉంటాయని ఆయన వివరణ ఇచ్చారు. ఆ పాత్ర నుంచి బయట పడేందుకు ఈ సినిమా చేసినట్లు వివరించారు. దీంతో హీరోయిన్లు ఇద్దరూ కిస్ సీన్లను రిజెక్ట్ చేశారని కామెంట్స్ పెడుతున్నారు.



# పేరెంట్స్ సలహాకు షాకయ్యా

బాబు బంగారం' (ఓ పాటలో), 'ఆటాడుకుందాం.. రా' సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పంజాబీ నటి సోనమ్ బజ్వా. తాను నటించిన హిందీ సినిమా 'ఏక్ దీవానే కీ దీవానియత్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో.. కెరీర్ ప్రారంభ రోజుల్ని గుర్తుచేసుకున్నారు. కిస్ సీన్ల విషయంలో తన సందేహాన్ని తల్లిదండ్రులకు చెబితే.. వారిచ్చిన సలహా విని షాకయ్యానని తెలిపారు.

"ముద్దు సన్నివేశాలున్న కారణంగా నేను పలు హిందీ సినిమాల్లో నటించేందుకు తిరస్కరించా. ఒకవేళ కిస్ సీన్లలో యాక్ట్ చేస్తే పంజాబీ ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారా? ఫ్యామిలీ ఆడియన్స్ ఏమనుకుంటారు? ఇది కేవలం నటనే అని నా కుటుంబం అర్థం చేసుకుంటుందా?.. బుర్ర నిండా ఇలాంటి ఆలోచనలే తిరిగేవి. నాకున్న సందేహాలన్నింటినీ ఓసారి తల్లిదండ్రులకు వివరించగా భారం తగ్గినట్టైంది. 'సినిమా కోసమే కదా అలా చేసేది. దాని వల్ల సమస్య ఏంటి?' అని వారు అనడంతో షాకయ్యా. ఇంతకాలం వీరితో ఈ టాపిక్ గురించి ఎందుకు చర్చించలేదా? అని అనిపించింది" అని సోనమ్ పేర్కొన్నారు. హర్షవర్ధన్ రాణే హీరోగా మిలప్ జవేరి తెరకెక్కించిన రొమాంటిక్ డ్రామా 'ఏక్ దీవానే కీ దీవానియత్' ఈ నెల 21న విడుదల కానుంది. 2016 తర్వాత సోనమ్ బజ్వా టాలీవుడ్‌లో మళ్లీ నటించలేదు. పంజాబీ, హిందీ సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు.



# జగపతి బాబుకు క్షమాపణలు చెప్పిన కీర్తి సురేశ్

నటుడు జగపతి బాబుకు కీర్తి సురేశ్ క్షమాపణలు చెప్పారు. ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా'. ఇప్పటికే పలువురు సినీ తారలు ఈ షోకు వచ్చి ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకోగా, తాజాగా కీర్తి ఈ షోలో సందడి చేశారు. తన పెళ్లికి సంబంధించిన విశేషాలు పంచుకున్నారు.

అయితే, పెళ్లికి జగపతి బాబును పిలవలేకపోయానంటూ ఆయనకు క్షమాపణలు చెప్పారు. ఇండస్ట్రీలో చాలా తక్కువమందికి తన ప్రేమ గురించి తెలుసని వారిలో జగపతి బాబు కూడా ఒకరని కీర్తి చెప్పారు."పెళ్లి అయ్యేవరకూ నా ప్రేమ గురించి చాలా తక్కువమందికి చెప్పాను. నేను మిమ్మల్ని (జగపతిబాబు) నమ్మాను కాబట్టి మీతో నా వ్యక్తిగత విషయాల గురించి పంచుకున్నాను. కానీ, పెళ్లికి పిలవలేకపోయాను. క్షమించండి" అని కీర్తి అన్నారు.

ఇక ఆంథోనీ తటిల్‌తో ప్రేమ గురించి తెలుపుతూ.. "ఇంట్లో వాళ్లు అంగీకరించిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. 15 ఏళ్లు ప్రేమించుకున్నాం. ఆరేళ్లు తను ఖతార్‌లో ఉన్నాడు, నేను ఇండియాలో ఉన్నాను. అక్కడినుంచి వచ్చాక ఇంట్లో చెప్పాలనుకున్నాం. నాలుగేళ్ల క్రితమే ఇంట్లో చెప్పాం. మా నాన్న వెంటనే అంగీకరించారు. ఇంట్లో చెప్పడం కంటే ముందే మీకు చెప్పా" అని కీర్తి తెలిపారు. ఇక తనకు రజనీకాంత్ అంటే చాలా ఇష్టమని కాలేజ్‌కు డుమ్మా కొట్టి ఆయన సినిమాలకు వెళ్లినట్లు చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999